సాక్షి
కుమురం భీం
శనివారం ; 24 ; ఆగస్టు ; 2024



జ్వరాలతో ఉక్కిరిబిక్కిరి

సీజనల్ వ్యాధులతో జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇంటికి ఒకరిద్దరు చొప్పున మంచం పడుతున్నారు.

9లో▸

18 నుంచి వార్షిక పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: డైట్(టీటీసీ) సెకండియర్ విద్యార్థులకు వచ్చే నెల 18 నుంచి 24 వరకు వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.8 /25.4

ఆకాశం పూర్తిగా మబ్బులు పట్టి ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



నిరసన తెలుపుతున్న గెస్ట్ లెక్చరర్లు

ఆసిఫాబాద్‌రూరల్: గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అతిథి అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతి మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2012 నుంచి పని చేస్తున్న అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ రెన్యువల్ ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిది నెలలు మాత్రమే వేతనం తీసుకుంటూ అకాడమిక్ సంవత్సరం మొత్తం పని చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రెగ్యులర్ నియామకాలతో తమ ఉనికి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.42వేల వేతనం చెల్లించాలని కోరారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావుకు వినతిపత్రం అందించారు. నాయకులు కృష్ణమూర్తి, రాము, యాదగిరి, భిక్షపతి, రాంబాబు, స్వాతి, అశ్విని, మౌనిక, సునీత తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్' విద్యను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: వ్యక్తిగత కారణాలతో చదువు కొనసాగించలేనివారు ఓపెన్ పది, ఇంటర్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ ప్రవేశాల పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లు నిండి, ఎలాంటి విద్యార్హతలు లేకున్నా చదవడం, రాయడం వచ్చిన వారు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సంప్రదించాలన్నారు. హెచ్‌ఎంలు సుభాష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా మహిళాశిశు సంక్షేమ అధికారి భాస్కర్‌తో కలిసి సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, పిరామిల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఎస్ఎస్ఎఫ్ఎస్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో సకాలంలో పౌష్టికాహారం అందించి, పిల్లల ఆరోగ్య స్థితిగతులు పర్యవేక్షించాలన్నారు. ప్రతీ కేంద్రంలో టీహెచ్ఆర్, హెచ్‌సీఎం వివరాలు పోషణ్ ట్రాకర్ యాప్‌లో వందశాతం నమోదు చేయాలన్నారు. పిల్లల ఎత్తు, బరువు నమోదు చేస్తూ పోషకాహార లోపం ఉన్న వారిని గుర్తించాలని సూచించారు. సదుపాయాల కల్పన కోసం పూర్తి వివరాలతో నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి పోరాటం'



మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: సమస్యల పరిష్కారం కోసం పోరాడేందుకు ప్రతిఒక్కరూ సిద్ధంగా ఉండాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ప్రధాన కార్యదర్శి పవార్ తుకారాం, అధికార ప్రతినిధి పవన్ కుమార్‌తో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హామీ ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు ఎంటీఎస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సందీప్, నగేశ్, దేవేందర్, సంతోష్‌కుమార్, తిరుపతి, మహేశ్, రమేశ్, రమణ, మహేందర్, భోజన్న, భవానీ తదితరులు పాల్గొన్నారు.

నిధుల్లేక.. నిలిచిన పనులు



కలెక్టరేట్ ఎదుట అసంపూర్తిగా హరిత హోటల్

- జిల్లా కేంద్రంలో రెండేళ్లుగా అసంపూర్తిగా 'హరిత హోటల్'
- ఇప్పటికే రూ.4 కోట్ల వ్యయం
- మంత్రి సీతక్క చొరవతో మళ్లీ కదలిక
- రూ.6.24 కోట్లు కేటాయించాలని ఐటీడీఏ పీవోకు టీఎస్‌టీడీసీ ఎండీ లేఖ

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎస్‌టీడీసీ) నిధులతో పర్యాటక ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రారంభించిన హరిత 'బడ్జెట్ హోటల్' నిర్మాణ పనులు నిలిచిపోయాయి. రూ.4 కోట్ల బడ్జెట్‌తో మూడేళ్ల కిందట పనులు ప్రారంభించగా.. నిధుల లేమి కారణంగా ఆ పనులు గ్రౌండ్ ఫ్లోర్ రూఫ్ స్లాబ్ వరకే పరిమితమయ్యాయి. గత రెండేళ్లుగా బడ్జెట్ హోటల్ పనుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా తయారైంది. ఇటీవల మంత్రి సీతక్క జిల్లా పర్యటనకు వచ్చిన సమయంలో హోటల్ పూర్తి చేయాలని టూరిజం అధికారులను ఆదేశించడంతో మళ్లీ కదలిక వచ్చింది. అయితే హరిత హోటల్ 'బడ్జెట్' ఇప్పుడు రెట్టింపునకు చేరడంతో నిధుల కోసం టూరిజం శాఖ ఉన్నతాధికారులు ఉట్నూర్ ఐటీడీఏ పీవోకు లేఖ రాసినట్లు తెలిసింది. అంతా సజావుగా జరిగితే మరికొన్ని రోజులకు మళ్లీ పనులు ప్రారంభించే అవకాశం ఉందని జిల్లా టూరిజం శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

2020లో టెండర్లు

పర్యాటక రంగ అభివృద్ధి సంస్థ ప్రతిపాదన మేరకు జిల్లాలోని కెరమెరి మండలం జోడేఘాట్ గ్రామంలో కుమురంభీం మెమోరియల్, ట్రైబల్ మ్యూజియం, యాంపీ థియేటర్, బడ్జెట్ హోటల్ నిర్మాణం కోసం ప్రభుత్వం 2019లో రూ.22 కోట్లు మంజూరు చేసింది. ఇందులో హోటల్ నిర్మాణ కోసం రూ.4 కోట్లు కేటాయించింది. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో బడ్జెట్ హోటల్ నిర్మాణానికి 2020లో టెండర్లు పిలిచారు. రూ.5.15 కోట్ల అంచనా విలువ కలిగిన ఈ పనులను 2021లో గోల్డెన్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ 14.50 శాతం తక్కువ ధరకే టెండర్ వేసి పనులు దక్కించుకుంది. అగ్రిమెంట్ పూర్తి చేసుకున్న కాంట్రాక్టర్ 2022లో ఒప్పందం ప్రకారం సుమారు 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణం గల హరిత హోటల్ నిర్మాణంలో ఎంట్రెన్స్ లాబీ, రెస్టారెంట్, కాన్ఫరెన్స్ హాల్, కమర్షియల్ స్పేస్, టాయిలెట్ బ్లాక్, కిచెన్ అండ్ పాంట్రీ పనులను పూర్తి చేశారు. కాగా.. ఒప్పందం ప్రకారం కాంట్రాక్టర్‌కు ఇప్పటికీ రూ.80 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఇక సివిల్ పనులైన ఇటుక, ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, డోర్స్, విండోస్, పెయింటింగ్ పనులతోపాటు సెప్టిక్ ట్యాంక్, సంప్, పావేర్ బ్లాక్స్, టైల్స్, కెర్బ్‌స్టోన్స్, వాటర్ సప్లయ్, శానిటరీ ఫిట్టింగ్స్, ఎలక్ట్రికల్ పనులు, ల్యాండ్ స్కేపింగ్ వంటి పనులు చేపట్టాల్సి ఉంది. నిధుల లేమి కారణంగా పనులు ముందుకు సాగడం లేదు.

నిధుల కోసం లేఖ..

నిధుల లేమి కారణంగా పనులు పూర్తి చేయకపోవడంతో ప్రస్తుతం హోటల్ నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్క దృష్టికి హరిత హోటల్ నిర్మాణం విషయం తీసుకెళ్లగా.. ఆమె పర్యాటక శాఖ అధికారులతో మాట్లాడారు. మంత్రి ఆదేశాలతో నిర్మాణ పనులు పూర్తి చేయడం కోసం పర్యాటక రంగ అభివృద్ధి సంస్థ ఎండీ కె.రమేశ్ నాయుడు ఈ ఏడాది మార్చి 3న ఉట్నూర్ ఐటీడీఏ పీవోకు రూ.6.24 కోట్లు నిధులు కేటాయించాలని లేఖ రాశారు. ఐటీడీఏ పీవో నిధులను మంజూరు చేస్తే త్వరలో ఆసిఫాబాద్ పట్టణంలో అన్ని హంగులతో కూడిన బడ్జెట్ హోటల్ ప్రజలకు అందుబాటులోకి రానుంది.

మేధావుల సూచనలు | ప్రభుత్వానికి నివేదిస్తాం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- ఆర్‌వోఆర్ ముసాయిదా బిల్లుపై చర్చావేదిక
- అభిప్రాయాలు వెల్లడించిన విశ్రాంత ఉద్యోగులు, నాయకులు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: నూతన ఆర్‌వోఆర్ చట్టంపై సూచనలు, సలహాలు ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి నూతన ఆర్‌వోఆర్ ముసాయిదా బిల్లుపై విశ్రాంత రెవెన్యూ అధికారులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, నిపుణులతో చర్చావేదిక ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్‌వోఆర్ ముసాయిదా బిల్లుపై నిపుణులు అందించిన ప్రతీ సలహాను సీసీఎల్‌కు నివేదిస్తామని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న భూసమస్యల పరిష్కారానికి నూతన చట్టాన్ని రూపొందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో అమలులో ఉన్న భూరికార్డులు, నిర్వహణ పద్ధతులను పరిశీలించిన నిపుణుల బృందం నూతన ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదా బిల్లును రూపొందించిందని తెలిపారు. నూతన చట్టాల రూపకల్పనలో ప్రజలను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్చా కార్యక్రమం నిర్వహించామన్నారు. భూరికార్డుల నిర్వహణ మెరుగ్గా ఉండే విధంగా ముసాయిదా బిల్లుపై రైతు సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు సలహాలు, సూచనలు రాతపూర్వకంగా కలెక్టరేట్‌లో అందిస్తే నివేదిక రూపంలో సీసీఎల్ఏకు అందిస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలో విశ్రాంత తహసీల్దార్లు, పలువురు మేధావులు, న్యాయవాదులు, రైతుసంఘాల నాయకులు, ఆదివాసీ సంఘాల నాయకులు తమ సలహాలు, సూచనలు వెల్లడించారు. గ్రామాల్లో ఆబాదీ భూముల రికార్డులను ఆధునీకరించడం, సాదాబైనామా, భూముల రిజిస్ట్రేషన్ రుసుం వసూలు చేయడం, అనుభవదారుడి కాలమ్ ఉండడం, అప్పీల్ అథారిటీ మండలాధికారికి ఉండాలని, నూతన చట్టం అమలుకు ప్రతీ గ్రామానికి రెవెన్యూ ఉద్యోగి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూసమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో అప్పిలేట్ అథారిటీ ఉండేవిధంగా చర్యలు తీసుకోవడం, ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చట్టాన్ని రూపొందించాలని అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

ఏజెన్సీ చట్టాలకు విఘాతం కలగొద్దు



నూతన ఆర్‌వోఆర్–2024 చట్టం ద్వారా 1/59, 1/70 వంటి ఏజెన్సీ చట్టాలకు ఎలాంటి విఘాతం కలగొద్దు. పీసాటీ యాక్ట్ 177 యథావిధిగా పొందుపరచాలి. ఏజెన్సీలో ఆదివాసీ ప్రజల హక్కులను కాపాడాలి.

– బుర్స పోచయ్య, ఆదివాసీ సంఘం నాయకుడు

మెరుగ్గా ఉన్నాయి



ఆర్‌వోఆర్ యాక్ట్‌లో అంశాలు మెరుగ్గా ఉన్నాయి. 1979 ఆర్‌వోఆర్ యాక్ట్‌లో ఉన్న అంశాలు కూడా ఉండాలి. కౌలుదారు చట్టం అమలు చేయాలి.

– సుభాష్, విశ్రాంత తహసీల్దార్

ఆర్డినరీ సేల్‌డీడ్‌పై దృష్టి సారించాలి



ఆర్డినరీ సేల్‌డీడ్‌పై దృష్టి సారించాలి. లేకపోతే అన్‌రిజిస్టర్డ్ ఆస్తులకు నష్టం వాటిల్లుతుంది. సాదాబైనామా దరఖాస్తులు పరిశీలించాలి.

– బోనగిరి సతీశ్‌బాబు, న్యాయవాది

రక్షిత కౌలుదారు చట్టం అమలు చేయాలి



రక్షిత కౌలుదారు చట్టం–1971 అమలు చేయాలి. సాదాబైనామా దరఖాస్తులు పరిష్కరించాలి. ఆర్‌వోఆర్ యాక్ట్‌లో ఉన్న అంశాలు మెరుగ్గా ఉన్నాయి.

– మధుకర్, ఏవో, కలెక్టరేట్

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్, అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతనందిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న బల్క్ మిల్క్ సెంటర్‌ను శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకం ద్వారా రుణ సదుపాయం కల్పించి వ్యాపార అభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని డీఆర్‌సీసీ సెంటర్‌ను పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేయనున్న యానిమల్ బర్త్ సెంటర్ (ఏబీసీ) పనులను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో దత్తారావు, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, జిల్లా పశువైద్యాధికారి సురేశ్, తహసీల్దార్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రీసై'కిల్' బాటిల్స్!



ఇదివరకే వినియోగించిన బాటిళ్లలో నీళ్లు నింపుతున్న కలెక్టరేట్ సిబ్బంది



చర్చావేదికలో టేబుళ్లపై వాటర్ బాటిళ్లు

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సమావేశాల్లో పాల్గొనే సిబ్బంది, ప్రజాప్రతినిధులకు పాత బాటిళ్లలో నీళ్లు నింపి అందిస్తున్నారు. శుక్రవారం నూతన రెవెన్యూ చట్టం (2024) ముసాయిదాపై కలెక్టరేట్‌లో నిర్వహించిన చర్చలో మేధావులు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ మాజీ అధికారులు, న్యాయవాదులు, ఇతర సంఘాల నేతలు పాల్గొన్నారు. వారికి ఇదివరకే వాడిన బాటిళ్లలో నీళ్లు నింపి అందించారు. సింగిల్ యూజ్ బాటిళ్లను రీసైక్లింగ్ కోసం పంపించాల్సి ఉండగా.. సిబ్బంది వాటితోనే తాగునీటిని అందించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలపై కఠినంగా వ్యవహరించాల్సిన ఉన్నతాధికారులే వాటిని ప్రోత్సహిస్తుండటం చర్చనీయాంశమైంది. కలెక్టరేట్‌లోనే కాకుండా జెడ్పీ సమావేశంలోనూ ఇలాంటి పరిస్థితే ఎదురవుతోంది.

పూలాజీబాబా జయంతి | ఘనంగా నిర్వహించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, పీవో ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అధికారులు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- అధికారులతో సన్నాహక సమావేశం

ఆసిఫాబాద్: సద్గురు పూలాజీబాబా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించే పూలాజీ బాబా జయంతి ఉత్సవాల నిర్వహణపై శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, పూలాజీ బాబా ట్రస్టు అధ్యక్షుడు ఇంగ్లె కేశవరావులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జైనూర్ మండలం పాట్నాపూర్‌లోని పూలాజీ బాబా సంస్థానంలో జయంతి ఉత్సవాలు నిర్వహించేందుకు అధికారులు, ట్రస్ట్ ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన, కెరమెరి, జైనూర్ మండలాల నుంచి భక్తుల సౌకర్యార్థం బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, సంచార మూత్రశాల, టాయిలెట్లు, వాహనాలు తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. భోజనాల వద్ద క్యూలైన్ పాటించే విధంగా ఏర్పాటు చేయాలని, సంస్థానానికి వెళ్లే రహదారులకు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పథకం కింద తాగునీటి సరఫరా చేయాలన్నారు. దోమల నివారణకు పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతోపాటు, ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. ప్రముఖులు వచ్చే అవకాశం ఉన్నందున పోలీసు బందోబస్తు చేపట్టాలన్నారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, డీఆర్‌డీవో దత్తారావు, అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టోల్ ఫుల్.. వసతులు నిల్

- సరాండి టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు ఇబ్బందులు
- లో క్వాలిటీ స్కానర్లతో సమయం వృథా
- వాహనాల పాసింగ్‌లో తీవ్ర జాప్యం
- తాగునీటికి బోరు నీళ్లే దిక్కు
- పాత ధరల బోర్డులు సైతం తొలగించని నిర్వాహకులు



ఫాస్ట్‌ట్యాగ్ స్కాన్ చేస్తున్న టోల్‌ప్లాజా సిబ్బంది



పాత టోల్ చార్జీలతో బోర్డులు

వాంకిడి(ఆసిఫాబాద్): నాలుగు వరుసల జాతీయ రహదారి– 363పై ఏర్పాటు చేసిన సరాండి టోల్ ప్లాజా వద్ద వాహనదారులకు వసతులు కరువయ్యాయి. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ జీఎం ఆఫీసు నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మహారాష్ట్ర సరిహద్దు వరకు నిర్మించిన 92 కిలోమీటర్ల ఈ రహదారిపై మందమర్రి వద్ద, వాంకిడి మండలం సరాండి వద్ద టోల్‌ప్లాజాలు ఏర్పాటు చేశారు. సుమారు నాలుగేళ్లుగా కొనసాగిన ఈ రహదారి పనులు పూర్తికాక ముందు నుంచే టోల్ వసూలు ప్రారంభించారు. తీవ్ర విమర్శలు వచ్చినా ఎన్‌హెచ్ఏఐ అధికారులు మాత్రం టోల్ వసూలుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. గతేడాది నవంబర్ 22న ప్రారంభించిన సరాండి టోల్ ప్లాజాలో నాసిరకం స్కానర్లు ఏర్పాటు చేసినట్లు వాహనదారుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఓ ప్రైవేటు కంపెనీ టోల్‌ప్లాజా నిర్వహిస్తుండగా జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) అధికారులు మాత్రం సౌకర్యాల కల్పనపై దృష్టి సారించడం లేదు.

టోల్‌ప్లాజా వద్ద పరిస్థితి ఇలా..

92 కి.మీ.ల పొడవున నిర్మించిన ఎన్‌హెచ్– 363పై గల సరాండి టోల్‌ప్లాజా వద్ద కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉంటుంది. తాగునీరు, బాత్రూంలు, టాయిలెట్స్, రెస్ట్ రూంల ఏర్పాటుతోపాటు ప్రశాంత వాతావరణాన్ని తలపించేలా మొక్కల పెంపకం చేపట్టాలి. బాత్రూంలు ఉన్నా వాటికి తాళాలు వేసి ఉంచుతున్నారు. అప్పుడప్పుడు నీటిసమస్య కూడా ఉత్పన్నమవుతుంది. తాగునీటి కోసం బాత్రూంల వద్ద ఏర్పాటు చేసిన ఫ్రిడ్జ్ పరిసరాల్లో నాచు తయారవుతోంది. ఫిల్టర్ చేసిన నీటిని కాకుండా బోరు నీటినే అందుబాటులోకి ఉంచుతున్నారు. బాత్రూంపై ఉన్న ట్యాంకులో స్టోర్ చేసిన నీటినే ఫ్రిడ్జ్‌లోకి నింపుతున్నారు. టోల్ చార్జీల వివరాలు తెలిసేలా సమీపంలో ఏర్పాటు చేసిన బోర్డులు మార్చకుండా పాత ధరలతోనే ఉన్నాయి. ప్లాజా పరిసరాల్లో ఖాళీ స్థలాల్లో అలంకరణ మొక్కలు పెంచాల్సి ఉండగా పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. అలాగే సరాండి టోల్‌గేట్ వద్ద మరో ప్రధాన సమస్య.. వాహనాల పాసింగ్ సమయంలో ఇబ్బందులు. వాహనాలకు ఉన్న ఫాస్ట్ ట్యాగ్ స్కాన్ చేసే సమయంలో ఆలస్యం జరుగుతుందని వాహనదారులు చెబుతున్నారు. అక్కడ పనిచేసే సిబ్బంది మరో స్కానర్ తీసుకువచ్చి స్కాన్ చేస్తే గాని బండ్లు ముందుకు కదలడం లేదు.

నిత్యం రూ.6లక్షలు వసూలు..

సరాండి టోల్‌ప్లాజాను మొదట రాన్‌బోర్ కంపెనీ నిర్వహించగా ప్రస్తుతం శ్రీసాయి ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేటు కంపెనీ నిర్వహిస్తోంది. ఇక్కడి నుంచి నిత్యం 1600 నుంచి 1700 వాహనాలు పాసింగ్ అవుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ప్రతిరోజూ వాహనాల రాకపోకలతో రూ.6లక్షలకు పైగా వసూలు అవుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి గతంలో ఉన్న రేట్లకు 5 శాతం చార్జీలు అధికంగా పెంచి ఎన్‌హెచ్ అధికారులు అమలు చేస్తున్నారు. ఏడాది క్రితమే పూర్తయిన రహదారి పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపించి రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. విశాలంగా కనిపించే ఎన్‌హెచ్– 363పై గుంతలు గమనించకుండా డ్రైవర్లు ప్రమాదాల బారిన పడుతున్నారు. టోల్‌ప్లాజా వద్ద ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్లే దారి సైతం అధ్వానంగా మారింది.

పాసింగ్ ఇవ్వడంలో ఆలస్యం



సరాండి టోల్‌ప్లాజా ఫాస్ట్ ట్యాగ్ స్కానర్లు సక్రమంగా పనిచేయడం లేదు. కొన్నిసార్లు అసలు స్కానింగ్ కూడా కావడం లేదు. సిబ్బంది మరో స్కానర్‌తో స్కాన్ చేస్తున్నారు. అప్పటి వరకు వేచి చూస్తున్నాం. పాసింగ్ ఇవ్వడంలో ఆలస్యమవుతోంది.

– షేక్ షేరు, డ్రైవర్, వాంకిడి

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలి



టోల్‌ప్లాజా వద్ద తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలి. బోరు నుంచి ట్యాంకులో నింపిన నీటిని ఫ్రిడ్జ్‌లో నింపడం సరికాదు. వాహనదారులకు మినరల్ వాటర్ అందుబాటులో ఉంచాలి.

– ఎస్.మినేశ్, కారు ఓనర్

వసతులు లేవు



టోల్ వసూళ్లపై దృష్టి పెట్టిన అధికారులు రహదారిపై గుంతలకు మరమ్మతులు చేపట్టడంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారు. గోయేగాం సమీపంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. టోల్‌ప్లాజా వద్ద వసతులు లేవు.

– దోంగ్రె రమేశ్, డ్రైవర్

క్లుప్తంగా

జనావాసాల్లోకి అడవి అలుగు



అలుగును పరిశీలిస్తున్న అధికారులు

మందమర్రిరూరల్: పట్టణంలోని జాతీయ రహదారి టోల్ ప్లాజా సమీపంలోని జనావాసాల్లోకి శుక్రవారం అడవి అలుగు వచ్చింది. పంచర్ షాపు నిర్వాహకుడికి అలుగు కనిపించడంతో వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని అలుగును స్వాధీనం చేసుకుని బొక్కలగుట్ట వద్ద గల గాంధారి వనంలోని అటవీ ప్రాంతంలో వదిలేశారు.

ఎస్‌బీఐ ప్రైవేట్ ఉద్యోగి సస్పెన్షన్



విచారణ జరుపుతున్న రీజినల్ మేనేజర్

జన్నారం: పంట రుణం రెన్యువల్ విషయంలో రైతు నుంచి రూ. 15 వేలు లంచం తీసుకున్న ఎస్‌బీఐ ప్రైవేట్ ఉద్యోగి ఎఫ్‌ఓఎస్ సాయికుమార్‌పై అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. శుక్రవారం మంచిర్యాల రీజినల్ మేనేజర్ రితేష్ బ్యాంకుకు వచ్చి విచారణ జరుపగా రైతు నుంచి డబ్బులు తీసుకున్న విషయంపై సాక్షులను విచారించి తాత్కాలికంగా ఆయనను తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు మేనేజర్ మహేశ్ తెలిపారు. పూర్తి విచారణ అనంతరం నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కేసు నమోదు

రైతు నుంచి రూ.15 వేలు తీసుకున్నట్లు హాస్టల్ తాండాకు చెందిన మ్యాక ఎర్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌బీఐ ఎఫ్‌ఓఎస్ సాయికుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు.

మహిళా ఉద్యోగులను వేధిస్తే చర్యలు

శ్రీరాంపూర్: సింగరేణిలో మహిళా ఉద్యోగులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కంపెనీ సీఎండీ బలరాం నాయక్ సూచించారు. ఈ మేరకు ఆయన ఏరియా జీఎంలకు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలన్నారు. వేధింపులు గురిచేసే వారిపై ఫిర్యాదు చేయడానికి అన్ని ఏరియాల్లో కమిటీలు, అంతర్గత కంప్లైంట్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు.

మంచం పట్టిన కొల్లూర్



జ్వరంతో మంచంపట్టిన మహిళ

కోటపల్లి: మండలంలోని కొల్లూర్ ఎస్సీ, ఎస్టీ కాలనీలో పది రోజులుగా ఇంటికి ఇద్దరి చొప్పున జ్వరాలతో మంచం పట్టారు. ఇటీవల వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేసినా జ్వరాలు నియంత్రణలోకి రావడం లేదు. దీంతో జ్వరబాధితులు ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. శుక్రవారం అధిక జ్వరంతో బాధపడే వారు 108లో చెన్నూర్ ఆస్పత్రికి వెళ్లారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జ్వరాలు విజృంభించకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గల్ఫ్ గాయం.. తీరని దుఃఖం!

ఖానాపూర్ మండలం గోసంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని నడింపల్లెకు చెందిన పుల్కం రాజేశ్వర్ ఉపాధి నిమిత్తం మూడేళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. అక్కడ కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 8న గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దుబాయ్‌లో ఉన్న బంధువులు మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించారు.

నిర్మల్ జిల్లా భైంసా మండలం కోతుల్‌గామ్ గ్రామానికి చెందిన సట్ల నరసయ్య జీవనోపాధికోసం ఏడాది క్రితం దుబాయ్‌కి వలస వెళ్లాడు. వారం రోజులక్రితం అనారోగ్యానికి గురయ్యాడు. ఆదివారం వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో తాను ఉంటున్న గదికే పరిమితమయ్యాడు. మంగళవారం తోటి కార్మికులు వెళ్లి చూడగా శవమై కనిపించాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించే ఏర్పాట్లు చేయాలని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం దేవునిగూడకు చెందిన కునారపు వెంకటేశ్ (28) ఉపాధి కోసం గతేడాది ఇరాక్ దేశం వెళ్లాడు. నాలుగు నెలలు అక్కడ పనిచేశాడు. అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా కృంగిపోయాడు. ఈ ఏడాది జనవరిలో గుండెపోటుతో మృతి చెందాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మెండోళ్ల సుధాకర్ ఆరునెలల క్రితం జిల్లాకు చెందిన ఓ ఏజెంట్‌కు లక్షలు చెల్లించి విజిట్ వీసాపై బహ్రెయిన్ వెళ్లాడు. అక్కడ సరైన పని దొరకక, చేసిన పనికి వేతనం రాక నరకయాతన అనుభవించాడు. దీంతో మనస్తాపానికి గురై ఈనెల 15న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని తెప్పించేందుకు గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం పాత మామిడిపల్లికి చెందిన పత్తిపాక వెంకటేశ్ (41) ఉపాధి నిమిత్తం గతేడాది జూన్ 21న సౌదీ వెళ్లాడు. అక్కడే పనిచేస్తుండగా జూలై 3న ఫిట్స్ రావడంతో తోటి కార్మికులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అదే నెల 8న మృతి చెందాడు. 19 రోజులకు మృతదేహం స్వగ్రామం చేరుకుంది.

- బతుకుదెరువుకు వెళ్లి మృత్యువాత పడుతున్న కార్మికులు
- నకిలీ ఏజెంట్ల వలలోపడి విలవిల..
- అక్కడ ఉండలేక, ఇక్కడికి రాలేక నరకయాతన
- కుటుంబ సభ్యుల అరణ్యరోదన
- కొనసాగుతున్న వరుస ఘటనలు



దేవునిగూడ లో వెంకటేశ్ శవపేటికపై పడి రోదిస్తున్న కుటుంబసభ్యులు(ఫైల్)



గల్ఫ్ వలసలపై అవగాహన కల్పిస్తున్న గల్ఫ్ సంఘాల నాయకులు (ఫైల్)



దుబాయ్‌లో ఆత్మహత్యచేసుకున్న వ్యక్తి మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని గల్ఫ్‌నాయకులకు విన్నవిస్తున్న బాధిత కుటుంబీకులు(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: 'దూరపు కొండలు నునుపు' అనే చందంగా ఉన్న ఊరిలో ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్ దేశాలకు వెళ్తే ఆర్థికంగా బాగుపడతామని జిల్లా నుండి ఒకరిని చూసి మరొకరు దుబాయ్, కువైట్, బహ్రెయిన్, తదితర దేశాలకు వలసబాట పడుతున్నారు. అలా వెళ్లినవారు అప్పుల బారినపడి అక్కడే తనువు చాలిస్తున్న ఘటనలు జిల్లాలో అనేకం కనిపిస్తున్నాయి. మృతదేహాల కోసం కుటుంబ సభ్యులు నెలల తరబడి ఎదురు చూడడం, ప్రభుత్వాలు, కార్మిక సంఘాల నాయకులను వేడుకోవడం వంటి ఉదంతాలు జిల్లాలో అనేకం కనిపిస్తున్నాయి.

నకిలీ వీసాలతోనే...

విదేశాల్లో ఉద్యోగాల పేరిట నకిలీ ఏజెంట్ల మోసాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. కొన్నేళ్లుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గల్ఫ్ దేశాలకు వలసలు పెరిగిపోతుండడంతో ఇటీవల ఏజెంట్ల సంఖ్య కూడా ఎక్కువైపోతోంది. గ్రామీణ ప్రాంతాలవారు గల్ఫ్ దేశాలబాట పట్టేందుకు ఆసక్తి చూపుతుండటంతో వారికి ఎక్కువ జీతాలను ఏరచూపుతూ వల వేస్తున్నారు. దీంతో నకిలీ ఏజెంట్ల బారినపడి అక్కడికి వెళ్లిన కార్మికులు తీవ్ర అపసోపాలు పడుతున్నారు. అక్కడ సరైన వేతనం లేక ఆర్థికంగా చితికిపోతున్నారు. గత్యంతరం లేక అక్కడే బలవన్మరణాలకు పాల్పడటమో, మనోవేదనతో గుండెపోటుకు గురికావడంతోనో తనువు చాలిస్తున్నారు.

ఉపాధి అవకాశాలు లేకనే..

ఉన్న ఊరిలో ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్ దేశాల బాట పడుతున్న కార్మికులు అక్కడ నరకయాతన అనుభవిస్తున్నారు. ఎప్పుడు స్వగ్రామానికి తిరిగి వస్తామో తెలియని పరిస్థితి నెలకొంటుంది. ఉమ్మడి జిల్లా నుండి ఎన్నో ఆశలతో కువైట్, సౌదీ అరేబియా, ఖతార్, బహ్రెయిన్, దుబాయ్ తదితర గల్ఫ్ దేశాలకు వెళ్తున్న కార్మికులు ఏజెంట్ల మోసాలతో వేదన అనుభవిస్తున్న తీరు ఇటీవల విడుదల చేస్తున్న సెల్ఫీ వీడియోలు తెలియజేస్తున్నాయి. చేసిన పనికి సరైన వేతనం అందటం మాట అటుంచి తిరిగి ఇంటికి రావాలన్నా విమాన ప్రయాణ చార్జీలకు వేలాది రూపాయలు వెచ్చించలేక మానసిక ఒత్తిడికి గురై అక్కడే మృత్యువాత పడుతున్న ఉదంతాలు వరుసగా వెలుగుచూస్తున్నాయి.

విజిట్ వీసాలతో గాలం

గల్ఫ్ దేశాల్లో ఉద్యోగం అనగానే ఎగిరి గంతేస్తూ ఇక్కడి కార్మికులు సరైన నైపుణ్యం లేకుండానే ఫ్లైట్ ఎక్కి విదేశాలకు వెళ్లిపోతున్నారు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత సరైన నైపుణ్యాలు లేకపోవడంతో అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. దీనికి తోడు విజిట్ వీసాపై వెళ్లి అక్కడ నైట్ వాచ్‌మెన్‌గా, కాపలాదారులుగా, ఇతర షాపింగ్‌మాల్స్‌లో లేబర్లుగా, గొర్రెలు, మేకల కాపరులుగా పనులు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. కంపెనీ వీసా పేరుతో ఒక్కొక్కరి వద్ద రూ.రెండు లక్షల నుంచి నాలుగు లక్షల వరకు వసూలు చేసి ఏజెంట్లు మోసం చేస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గల్ఫ్ దేశాలకు వలసబాట పడుతున్న కార్మికులకు సహకారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రభుత్వ సహకారం అవసరం



గల్ఫ్ దేశాలకు వలసబాట పడుతున్న కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన సహకారం అందించాలి. అనుమతి పొందిన ఏజెంట్ల ద్వారానే విదేశాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి. గల్ఫ్ దేశాల బాట పడుతున్న వారికి ఇక్కడే పలు రంగాల్లో స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తే వలసలు కూడా తగ్గుముఖం పడుతాయి. ఇక్కడే ఉపాధి అవకాశాలు పెంచుకునేలా చైతన్యం కల్పించాలి. గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం ద్వారా పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

– స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, నిర్మల్

కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా సంస్థ లాభాల్లో వాటా చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీరాంపూర్ టింబర్ యార్డ్ జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నారన్నారు. సంస్థ లాభాలలో కాంట్రాక్టు కార్మికుల కృషి కూడా ఎంతో ఉందన్నారు. కానీ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కంపెనీ లాభాలను ప్రకటించి అందులో నుండి కాంట్రాక్ట్ కార్మికులకు వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు గూడా వీరేశం, ఖాతా రాజు, ప్రభాకర్, సురేంద్ర చారి, రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ అధికారికి సన్మానం



శ్రీధర్‌ను సన్మానిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: ఎస్సార్పీ 3 గనిలో రక్షణ అధికారిగా విధులు నిర్వర్తించి ఆర్జీ–2 ఏరియాకు బదిలీపై వెళ్తున్న జీ.శ్రీధర్‌ను శుక్రవారం గని అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. గనిపై జరిగిన కార్యక్రమంలో మేనేజర్ వెంకట్రావు, ఇతర అధికారులు ఆయనను సత్కరించి అతని సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గని అధికారులు గౌస్‌పాషా, మహేందర్, ప్రేమ్ కుమార్, అరుణ్ కుమార్, రామకృష్ణ శ్రవణ్ పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో..

ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో శ్రీధర్‌ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ పిట్ సెక్రెటరీ పెంట శ్రీనివాస్, నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీనివాసరావు, సుధాకర్, నరసింహారెడ్డి, రాజయ్య, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో ఉత్తమ పురస్కారాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్‌పీడీసీఎల్ పరిధిలో ఉద్యోగుల మధ్య స్నేహపూర్వక పోటీ పెంచి వివిధ పారామీటర్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు విద్యుత్ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి 'బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ ది మంత్' పేరిట ఏప్రిల్ నుంచి ప్రతీనెల బహుమతులు అందజేస్తున్నట్లు విద్యుత్ శాఖ మంచిర్యాల జిల్లా ఎస్‌ఈ ఎస్.శ్రావణ్‌కుమార్ తెలిపారు. సప్లై మెయింటనెన్స్, డీటీఆర్ నిర్వహణ, వైఫల్యాలను తగ్గించడం, విద్యుత్ అంతరాయం తగ్గించడం, వినియోగదారులందరికీ సత్వర సేవ, కొత్త సర్వీస్ కనెక్షన్ల మంజూరు, మీటర్ల బిగింపు, ఎనర్జీ ఆడిట్, కెపాసిటర్స్‌ని పెంచడం తదితర మెరుగైన చర్యలు తీసుకుంటూ సంస్థ మనగడకు తోడ్పడడం, వినియోగదారులకు అందుబాటులో ఉంటూ అంతరాయం లేని సరఫరా చేయడం వంటి అంశాలను పరిగణంలోకి తీసుకోవడం జరుగుతుందని వివరించారు. ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లాలో బెల్లంపల్లి రూరల్ ఆపరేషన్ ఏఈ, ఉత్తమ అవార్డు, మేలో హాజీపూర్ ఆపరేషన్ ఏఏఈ సిబ్బందికి, మంచిర్యాల ఎస్‌ఈ, ఆపరేషన్ సిబ్బందికి ఉత్తమ అవార్డు, జూన్‌లో లక్సెట్టిపేట ఏఈ ఆపరేషన్ సర్కిల్ పరిధి సిబ్బందికి, ఏడీఈ లక్సెట్టిపేట ఆపరేషన్ విభాగం సిబ్బందికి, మంచిర్యాల ఎస్‌ఈ ఆపరేషన్ విభాగం సిబ్బందికి, జూలైలో ఏఈ ఆపరేషన్ బెల్లంపల్లి రూరల్ సిబ్బందికి ఉత్తమ అవార్డుకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు.

మస్టర్లలో కొట్టివేతలు..లెక్కల్లో తేడాలు



వివరాలు వెల్లడిస్తున్న సామాజిక తనిఖీ బృందాలు

వేమనపల్లి: మండలంలో ఉపాధిహామీ పనుల మస్టర్లలో కొట్టివేతలు, హరితహారం కిందనాటిన మొక్కల్లో భారీగా తేడాలు వచ్చినట్లు సామాజిక తనిఖీ బృందాలు గుర్తించాయి. శుక్రవారం మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ మండల ప్రజావేదిక నిర్వహించారు. 2023 ఆగస్టు 13 నుంచి 2024 ఆగస్టు 16వరకు రూ.2 కోట్ల 50 లక్షల నిధులతో చేపట్టిన ఉపాధిహామీ పనులపై వారం రోజులుగా సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ ప్రజావేదికకు డీఆర్‌డీఓ కిషన్ ముఖ్య అతిథిగా హాజరై 14 గ్రామపంచాయతీలకు సంబంధించిన నివేదికలు సోషల్ ఆడిట్ జరిపించారు. హరితహారం రిజిస్టర్‌లు, ఎంబీల నిర్వహణలో వర్క్‌ఫైల్ ఒకే స్థాయిలో లేవని గుర్తించారు. కూలీల సంతకాలు సరిగా లేకుండా పనుల నిర్వహణ కొనసాగినట్లు వెల్లడైంది. నాటిన మొక్కలకు ఉన్న మొక్కలకు భారీగా వ్యత్యాసాలు ఉన్నట్లుగా గుర్తించారు. దీనికి బాధ్యులుగా పలువురు పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలకు జరిమానాలు విధించి షోకాజ్ నోటీసులు అందజేశారు. మళ్లీ ఇలాంటి పొరపాట్లు పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, గతంలో పని చేసిన ఎంపీడీఓ లక్ష్మయ్య, విజిలెన్స్ అధికారి కిరణ్, ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి



సత్యనారాయణగౌడ్ మృతదేహం

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుబ్బరాంపల్లిలో తాటిచెట్టు పైనుంచి కిందపడి ముక్కెర సత్యనారాయణగౌడ్ (38) అనే గీత కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బావురావుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని గుండాయిపల్లెకు చెందిన ముక్కెర రాజుబాయి, మధునయ్య దంపతుల కుమారుడు సత్యనారాయణగౌడ్ శుక్రవారం తాటికల్లు తీసేందుకు చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య కనకలక్ష్మి ఉంది. సంఘటనా స్థలాన్ని చెన్నూర్ ఎస్సై శ్వేత పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

పేపర్ మిల్లు యాజమాన్యంపై ఫిర్యాదు

కాగజ్‌నగర్ రూరల్: ఆరు సంవత్సరాలుగా సిర్పూర్ పేపర్ మిల్లు యాజమాన్యం మిల్లులో ఎన్నికలు నిర్వహించడంలేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లోని కార్మికశాఖ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి చర్చలు జరిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీఎల్‌టీ ఆర్డర్ ఇంప్లిమెంట్ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా నియమించాలన్నారు. ఈవిషయమై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆర్‌ఎస్‌పీ పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు లెండుగురె శ్యాంరావు, అంబాల ఓదెలు, నక్క మనోహర్, పేపర్ మిల్లు యూనియన్ నాయకులు ఈర్ల సతీశ్, రహీం, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.


అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత



పట్టుకున్న పశువులు

చింతలమానెపల్లి: మండలంలోని ఆడెపెల్లి నుండి మహారాష్ట్రకు అక్రమంగా పశువులను తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గురువారం సాయంత్రం ఆటో ట్రాలీలో రెండు కోడెలు, ఒక ఆవు దూడలను డబ్బా గ్రామం మీదుగా మహారాష్ట్రలోని అహేరికి తరలిస్తుండగా గ్రామస్తులు ప ట్టుకుని పోలీసులకు సమాచారం అందించా రు. పశువులను స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేశారు. చింతలమానెపల్లికి చెందిన కంబాల హరిప్రసాద్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించినట్లు ఎస్సై వివరించారు.

వాంకిడిలో...



పట్టుబడిన పశువులతో పోలీస్ అధికారులు

వాంకిడి: మండలంలోని గోయేగాం సమీపంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన పశువులను పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. పోలీస్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి శుక్రవారం గోయేగాం సమీపంలో తనిఖీలు నిర్వహించగా 27 పశువులు లభ్యమైనట్లు తెలిపారు. పట్టుబడిన పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డెంగీతో వృద్ధురాలు మృతి?

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఈఏడాది తొలి డెంగీ మరణం నమోదైంది. మున్సిపాలిటీ పరిధి 9వవార్డు సుబ్బారావుపల్లి గ్రామానికి చెందిన మేరుగు రామక్క (75) డెంగీతో శుక్రవారం మృతి చెందింది. వృద్ధురాలికి పది రోజుల క్రితం తీవ్రమైన జ్వరం రావడంతో వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించి డెంగీ జ్వరంగా నిర్ధారించినట్లు గ్రామస్తులు తెలిపారు. మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందినప్పటికీ జ్వరం అదుపులోకి రాలేదు. పరిస్థితి మరింతగా విషమించి కన్ను మూసింది. దీంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. గ్రామంలో దోమల నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలని, వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని ఆ వార్డు కౌన్సిలర్ బూక్య రాములు నాయక్ డిమాండ్ చేశారు.

శాంతిఖని గనిలో స్పృహతప్పిన కార్మికుడు



చికిత్స పొందుతున్న మోసిన్‌అలీ

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని గనిలో శుక్రవారం ఓ కార్మికుడు స్పృహ తప్పి పడిపోయిన ఘటన చోటు చేసుకుంది. గని కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం..గనిలో జనరల్ మజ్దూర్ కార్మికుడిగా పనిచేస్తున్న మోసిన్ అలీ అనే కార్మికుడు మొదటి షిఫ్టు విధులకు వెళ్లాడు. భూగర్భంలోదిగి 59 లెవల్ 3 డీప్‌లో చైర్ లిఫ్టింగ్ పనులు నిర్వహిస్తుండగా అకస్మికంగా స్పృహతప్పి కిందపడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు గని ఉపరితలానికి తీసుకు వచ్చి స్థానిక సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. భూగర్భంలో గాలి సరఫరా సరిగా లేక సదరు కార్మికుడు స్పృహతప్పి పడిపోయినట్లు కార్మికులు పేర్కొన్నారు.

కుల సంఘం పేరుతో వేధింపులపై ఫిర్యాదు

వేమనపల్లి: కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్కె మోహన్ అనే వ్యక్తి చందాల పేరుతో పాఠశాలకు వచ్చి తమను ఇబ్బంది పెడుతున్నారని మండలంలోని రాజారాం, మంగెనపల్లి ఎంపీపీఎస్ పాఠశాలల ఉపాధ్యాయులు నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.2 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తే అంత ఇవ్వలేమని గతంలో రూ.500 చొప్పున ఇచ్చామని అన్నారు. మళ్లీ గురువారం తన పాప ఆరోగ్యం బాగా లేక కాంప్లెక్స్ హెచ్‌ఎంకు సమాచారం ఇచ్చి అతని అనుమతితో అంగన్‌వాడీ టీచర్‌కు ఇన్‌చార్జి ఇచ్చి 3 గంటలకు ఇంటి నుంచి బయలుదేరారని రాజారాం ఉపాధ్యాయురాలు పేర్కొన్నారు. ఇదే అలుసుగా తీసుకొని తాను లేని సమయంలో పాఠశాలకు వచ్చి మోహన్ అనే వ్యక్తి అడిగినంత చందా ఇవ్వలేదని ఉద్దేశపూర్వకంగా రాద్ధాంతం చేస్తున్నారని వాపోయారు. ఫొటోలు, వీడియోలు తీసి వాట్సాప్ గ్రూపుల్లో , పత్రిక విలేకరులకు ఫార్వర్డ్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నాడన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వైకల్యం కలిగిన గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు యూత్ ఫర్ జాబ్స్ ఆధ్వర్యంలో రిటైల్, హాస్పిటాలిటి, బీఎఫ్‌ఎస్ఐ కోర్సుల్లో 2 నెలల పాటు హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ 40 నుంచి 100 శాతం వైకల్యం, 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు, టెన్త్, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 30 సాయంత్రం 6 గంటల లోగా ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9010295910 నంబరులో సంప్రదించాలని సూచించారు.

బెల్లం పట్టివేత



పట్టుకున్న బెల్లం, నిందితుడితో పోలీసులు

కౌటాల: అక్రమంగా తరలిస్తున్న బెల్లం పట్టుకున్నట్లు ఎస్సై ఎస్.మధుకర్ తెలిపారు. మండల కేంద్రంలోని తలోడి దసలి పట్టు పరిశ్రమ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న 7 క్వింటాళ్ల బెల్లం, 10కిలోల అల్లం పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆటోను సీజ్ చేసి జరుపుల శ్యామ్‌లాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



నిందితులను చూపిస్తున్న ఎస్సై ప్రశాంత్

వాంకిడి: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. తిర్యాణి మండలం రోంపల్లి గ్రామానికి చెందిన పెంద్రం శ్యాంరావు, మహారాష్ట్రలోని గడ్‌చాందూర్‌కు చెందిన బోయ భాస్కర్ అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా 620 గ్రాముల గంజాయి లభ్యమైంది. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

రెబ్బెన: మండలంలోని లక్ష్మీపూర్ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలనే లక్ష్యంతో మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా పెట్టగా అనుమతులు లేకుండా లక్ష్మీపూర్ వాగు నుండి రెబ్బెనకు ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టుబడినట్లు తెలిపారు. ట్రాక్టర్లను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌ను తరలించి కేసులు నమోదు చే సినట్లు ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.